


# ఇటీవల మంచికథలు ఎక్కువ! గొప్ప కథలు తక్కువ!!

**- శీలా వీర్రాజు**

ఆయన కవి, కథకుడు, నవలా రచయిత. తొమ్మిది కథా సంపుటాలు, నాలుగు నవలలు, ఐదు కవితా సంపుటాలు, రెండు వ్యాస సంపుటాలు వెలువరించారు. సాహిత్యంతో పాటు ఆయన చిత్రలేఖనంలోనూ ప్రతిభ చూపుతున్నారు. కొన్ని వందల పుస్తకాలకు ముఖచిత్రాలంకరణ చేశారు. ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. ఉప సంపాదకునిగా ఉద్యోగం చేపట్టి ప్రభుత్వ సంస్థలో అనువాదకునిగా స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన శీలా వీర్రాజుగారి గురించి ఈవారం..

ఆ రోజు ఉదయం శీలా వీర్రాజుగారికి మా ఎడిటర్ జగన్నాథశర్మగారు ఫోన్ చేశారు. ఆయన తమ ఇంటి చిరునామా ఇలా చెప్పారు ''మలక్‌పేటలో టి.వి.టవర్ వద్ద రైట్ తిరగాలి. సంహిత ఉమెన్స్ డిగ్రీ కాలేజీ వద్ద రైటుకు తిరిగి మూడు నాలుగు బిల్డింగులు దాటాక ఫస్ట్ లెఫ్ట్. కాస్త ముందుకు రాగానే గాల్లోకి పొడుచుకు వచ్చిన బ్రహ్మజెముడు కనిపిస్తుంది. ఇంటి ముందు నందివర్ధనం చెట్లు ఉంటాయి. అదే మా ఇల్లు''.

మేం ఇద్దరం ఆ చిరునామా ప్రకారం వెళ్లాం. నిజంగానే గాల్లోకి పొడుచుకు వచ్చినట్టుగా కిటికీ ఊచల్లోంచి బ్రహ్మజెముడు ఉంది. వీర్రాజు గారి ఇంట్లోకి అడుగు పెట్టగానే ఎదురుగా అల్మారాపైన పెద్ద నెమలి బొమ్మ. ఎడమవైపు ఏనుగులు. వాటి మధ్యన సీతారామలక్ష్మణులు. కాళిందిపై నృత్యం చేస్తున్న కృష్ణుడు. పుస్తకాలు. గోడలకు రంగురంగుల దుస్తుల్లో పల్లె పడతులు. గదంతా రకరకాల భంగిమల్లో రకరకాల శిల్పాలు. ఆ గది ఓ చిత్రకళాశిల్పాలయంగా ఉంది. టీ సేవనం అయ్యాక వీర్రాజు గారు తన గతంలోకి వెళ్లారు..



మునిపల్లెరాజు, [illegible] రాధాకృష్ణమూర్తితో..

### ఊహ తెలిసేప్పటికే మాది చితికిపోయిన కుటుంబం

మాది రాజమండ్రి. మా అమ్మానాన్నలు వీరభద్రమ్మ, సూర్య నారాయణ. మేం ముగ్గురు మగపిల్లలం, ఇద్దరు ఆడపిల్లలు. నేను ఏప్రిల్ 22, 1939న పుట్టాను. నాకు ఊహ తెలిసేప్పటికే మాది బాగా చితికిపోయిన కుటుంబం. మా తాతగారి కాలంలో విజయనగరం నుంచి పాతిక కుటుంబాలు వలస వచ్చి రాజమండ్రిలో స్థిరపడ్డాయి. మా వాళ్లందరిదీ చేనేత వృత్తి. మేము ఆ వృత్తి చేయలేదు. మా ఇంట్లో సేద్యం చేశారనడానికి గుర్తుగా పెద్ద భోషాణాలు రెండు, ధాన్యం నిల్వ చేసే ఓ చీకటి కొట్టు ఉండేవి. నాన్న కలప వ్యాపారం చేసేవాడు.

### గోదావరి ముంచేసింది

1953లో గోదావరికి పెద్ద వరద వచ్చింది. ముప్పాతిక భాగం పంటపొలాలు, ఇళ్లు మునిగిపోయాయి. నాన్నకు కలప వ్యాపారంలో బాగా నష్టం వచ్చింది. మేమున్న చోట చుట్టూ చేనేత పనిచేసేవారే ఎక్కువ. మిగిలిన వారు శ్రామిక వర్గం. మా అమ్మకేమో మమ్మల్ని బాగా చదివించాలని కోరిక. వ్యాపారంలో నష్టం రావడంతో తిండికి జరగడం కూడా కష్టంగా మారింది. మా అమ్మ అన్నదమ్ములందరూ ఉద్యోగులు. పెద్దమామయ్య డిఇవోగా ఉండేవారు. ఆయనే నన్ను చదివించారు.

### పుస్తకాలు అస్సలుండేవి కావు

మా పేటలో చదువుకున్న వాళ్లు తక్కువ. రామాయణ, భారత, భాగవతాది పుస్తకాలు ఊహకు కూడా వీలు లేదు. వ్రతాలు, నోముల పుస్తకాలయితే అస్సలుండేవి కాదు. నాకో బాల్యమిత్రుడు ఉండేవాడు. వాడి పేరు కందుల సూర్యప్రకాశరావు. వాడు నాకు బంధువు కూడా. వాళ్లనాన్నగారు కమ్యూనిస్టు. వాళ్ల యింట్లో బీరువా నిండుగా పుస్తకాలుండేవి. నేను వాటిని ఎక్కువగా చదివేవాడిని. మా వూర్లో పిచ్చికోమటి కొట్టు అని ఒకటి ఉండేది. అందులో అణాకి, అర్ధణాకి సెకండ్ హాండ్ పుస్తకాలు అమ్మేవారు. నేను వాటిని కూడా చదివేవాడిని. మా పెద్దమామ గారి మూడో అమ్మాయి పి. సరళాదేవి ఓ పెళ్లి సందర్భంలో జరిగిన వ్యవహారంపై మాలతీచందూర్‌కు ఉత్తరం రాసింది. అది ఆంధ్రపత్రికలో అచ్చయింది. అది చదివాక నేనెందుకు రాయకూడదు అనిపించింది. వెంటనే అరడజను కథలు రాశాను. అన్నీ చెత్తబుట్టలో చేరిపోయాయి. యిది తెలిసి సూర్యప్రకాశరావు నాన్న నా కథలు రెండు తీసుకుని చిత్తూరు జిల్లాలోని సభాగారికి పంపారు. ఆయన నడిపే 'పాంచజన్యం', 'దేవదత్త' పత్రికల్లో ఆ కథలు వచ్చాయి. అంటే నేను రచనలు చేయడానికి ప్రత్యక్షంగా సూర్యప్రకాశరావు, పరోక్షంగా సరళాదేవి కారణమయ్యారు.

### బాల్యమంతా ఆటపాటలే..

నేను చిన్నప్పుడు ఆడని ఆటలు లేవు. మా పేటలో చదువుకున్న వారు తక్కువ. అందువలన బాల్యమంతా ఎక్కువ ఆటపాటలతో గడచింది. బిళ్లంగోడి, కోతీకొమ్మచ్చి, సిగరెట్టు ప్యాకెట్లతో ఆటలు ఎక్కువ ఆడేవాళ్లం.


### ఇంటర్‌లోనే సీరియల్

సాహిత్యంలో పడి ఇంటర్‌లో, బి.ఎ.లో తప్పాను. మళ్లా పరీక్షలు రాశాను. కాలేజీలో సాహితీమిత్రుల పరిచయం ఏర్పడింది. 1955-57లో ఇంటర్ చదివే రోజుల్లో 'ప్రజామత' పత్రికలో నాదొక సీరియల్ వచ్చింది. బి.ఎ.లో రెండు కథల పుస్తకాలు వచ్చాయి. నాకు కథలు రాయడం పట్ల మొదట్లో ఎలాంటి దృక్పథమూ ఉండేది కాదు. కేవలం కథకుణ్ణి కావాలని రాశానంతే. హైదరాబాద్ వచ్చాక సాహితీ మిత్రుల పరిచయం, విరసం నాలో ప్రోగ్రెసివ్ ధోరణిని పెంచాయి. నా కథల్లో సున్నితమైన పాత్రలు ఎక్కువ. స్త్రీ పాత్రలే డామినేట్ చేసేవి. వర్ణనలు కూడా ఎక్కువే.

### దాదాపు 950 పుస్తకాలకు కవర్ పేజీలు..

నాకు చిన్నప్పటినుంచే చిత్రకళపట్ల కూడా ఆసక్తి. సుమారు 950 సాహిత్య పుస్తకాలకు కవర్ పేజీలు వేశాను. కమర్షియల్ పుస్తకాలకు కూడా చాలా వాటికి వేశాను. ఇంటర్ తర్వాత ఫెయిల్ అయ్యాక విజయనగరంలోని మేనమామ ఇంటికి వెళ్లాను. అక్కడ ఎందుకో ఉండలేకపోయాను. మూడు వారాలుండి వచ్చేశాను. కొండపల్లి వీరవెంకయ్య, ఆద్దేపల్లి పుస్తకాలకు టైటిల్స్ వేసి, పుస్తకాలు అమ్మి చదువుకున్నాను. అప్పట్లోనే సీరియల్స్ కూడా రాశాను. వాటి డబ్బు కూడా చదువుకోడానికి ఉప

భార్య సుభద్రాదేవి, కూతురు పల్లవితో...



యోగపడింది.

పెయింటింగ్ ఆసక్తి, కథ తృప్తి..

ఏది తృప్తి ఇస్తుందీ అంటే చెప్పలేను. ఇప్పుడు మోడ్రన్ బొమ్మలు వేస్తున్నాను. ఏ బొమ్మ వేసినా పూర్తయ్యాక పది సార్లయినా చూసుకుంటాను. రోజూ నేను వేసిన బొమ్మను మూడునాలుగు సార్లయినా చూస్తాను. కథ కూడా రాశాక ఒకటి రెండుసార్లు చదువుకుంటాను. నాకు రెండూ సమానమే. అయితే పెయింటింగ్ ఆసక్తి, కథలు తృప్తి.

మాది సభా వివాహం

శీలా శుభద్రాదేవి మా మేనమామ కూతురు. మా ఇద్దరికీ రోణంకి అప్పల స్వామి అధ్యక్షతన 1970లో సభావివాహం జరిగింది. నా కృషి వెనక తన ప్రోత్సాహం చాలా ఉంది. తను కూడా కథలు కవితలు రాస్తుంది. ఇప్పటికే కథా సంపుటాలు, కవితా సంపుటాలు వచ్చాయి.

థ్రిల్ అవుతుంటాను

ఏదైనా సభలకు, సమావేశాలకు వెళుతుంటాను, అప్పుడు ఎవరైనా కలసి మీ కథ చదివానని, అందులోని పాత్రలతో సహా చెప్పినప్పుడు థ్రిల్ అవుతుంటాను. 'నీడపట్టు మనిషి' అని నా కథ ఉంది. చాలా పెద్దకథ. ఒకసారి అందులోని కొన్ని పేరాలను ఒకతను అప్పచెప్పాడు.

అవార్డులొస్తేనే ఆనందం

రచయితలకు ఎప్పుడు ఆనందం కలుగుతుంది? అవార్డులు వస్తేనే కదా! 1969లో 'మైనా' నవలకు రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. అప్పటి వరకూ ఆ అవార్డు అందుకున్న వాళ్లందరిలోకీ చిన్నవాడిని నేనే. కథలకు 1990లో, కవిత్వానికి 2006లో తెలుగు యూనివర్శిటీ పురస్కారాలను అందుకున్నాను. వీటితోపాటు యింకా చాలా అవార్డులు వచ్చాయి.

ప్రభుత్వ ప్రోత్సాహం లేదు

యిప్పుడు చాలా పవర్ ఫుల్ కథకులు ఉన్నారు. చాలామంది వెనకటి రోజుల్లోవి గొప్ప కథలు అంటున్నారు గానీ, అంతకు మించిన కథలు ఇప్పుడు వస్తున్నాయి. వివిధ వాదాల్లో, వివిధ జీవితాల్లో చాలా లోతులకు పోయి చాలామంది రాస్తున్నారు. గొప్ప కథలూ వస్తున్నాయి. దాంతోపాటు సొల్లు కూడా ఉంది. తెలుగునుంచి అనువాదాలు జరగాల్సినన్ని జరగడం లేదు. యూనివర్శిటీలు, అకాడమీలు ఈ పని చేపట్టాలి. వారు చేయడం లేదు. ప్రభుత్వం నుంచి తగినంత ప్రోత్సాహం లేదు. తమిళనాడు, కేరళ, కర్నాటకల్లో ప్రభుత్వం సాహిత్యానికి బాగా ప్రోత్సాహం ఇస్తోంది. పుస్తకాలు అమ్ముడవుతుంటే రాద్దామనే కోరిక కూడా బాగుంటుంది. లెఫ్ట్ ఓరియంటెడ్ పత్రికలు దోపిడీ గురించి మాట్లాడతాయి కానీ రచయితలకు తృణమో పణమో ఇవ్వవు.

రచయితకు నిజాయితీ ఉండాలి

కథలో చదివే గుణం ఉండాలి. మంచి శైలి కూడా ముఖ్యం. కథను చదివి పక్కన పెట్టాక కూడా అందులోని సంఘటనలు, పాత్రలు మనల్ని కొంతకాలం పాటు అంటిపెట్టుకుని ఉండాలి. వాస్తవానికి అందులోని పాత్రలు మన జీవితంలో ఎప్పుడో ఎక్కడో తటస్తించినట్టుగా అనిపించాలి. చాలాకాలం తర్వాత కూడా ఏదైనా దృశ్యం చూసినప్పుడో, ఏదైనా సంఘటన జరిగినప్పుడో ఆ కథ గుర్తు రావాలి. అంటే సమాజ జీవితానికి దూరంగా కాకుండా, ప్రజల ఆశల్ని సఫలీకృతం చేసే ధోరణిలో – వర్తమాన ప్రగతి శీల దృక్పథంతో కథలు వుండాలి. వీటికి తోడు రచయితకు నిజాయితీ ఉండాలి. ఇప్పుడు వచ్చేవాటిల్లో మంచి కథలు చాలా ఉన్నాయి కానీ, గొప్ప కథలు తక్కువే.

ఆర్నెల్లు టిబి ఆసుపత్రిలో..

బి.ఎ. పరీక్షలు రాస్తూనే కృష్ణాపత్రికలో 1961లో సబ్ ఎడిటర్ కమ్ ఆర్టిస్ట్‌గా ఉద్యోగంలో చేరాను. 150 రూపాయల జీతం. రెండు సంవత్సరాలు పని చేశాను. మధ్యలో టిబి బాధపెట్టింది. ఇంట్లో తెలిస్తే బాధపడతారని ఉద్యోగ రీత్యా బొంబాయికి ట్రెయినింగ్‌కు పంపుతున్నారని ఇంటికి ఉత్తరం రాశాను. ఎస్.కె. సింగ్ అనే ఐ.ఎ.ఎస్. ఆఫీసర్ ఉండేవాడు. అతను నన్ను టిబి హాస్పిటల్‌లో చేర్పించాడు. ఆర్నెల్లు పేషెంటుగా ఆస్పత్రిలో ఉన్నాను. తర్వాత సమాచార శాఖలో అనువాదకుడిగా ఉద్యోగం వచ్చింది. కుందుర్తి, గోపాల చక్రవర్తి నాకు సహ ఉద్యోగులు. 1990లో స్వచ్ఛంద పదవీ విరమణ చేశాను.

– సుంకోజి దేవేంద్రాచారి

## నచ్చినవి

కథ : ఓ పువ్వు పూసింది

నవల : చివరకు మిగిలేది

కథకుడు : బుచ్చిబాబు

కవి : కుందుర్తి

పాట : రాజేశ్వరరావు, రావు బాలసరస్వతి గానంచేసిన పాటలన్నీ

గాయని : జానకి

గాయకుడు : ఘంటసాల

నటుడు : ఎస్వీ రంగారావు

హీరోయిన్ : భానుమతి

సినిమా : మల్లీశ్వరి

వ్యక్తి : కె.కె. మీనన్

వంట : బీరకాయ కూర



వాసిరెడ్డి సీతాదేవి చేతులమీదుగా రావిశాస్త్రి అవార్డు అందుకుంటూ...

**నాకు నచ్చిన నా కథ**

# ఏటి పాలైన యవ్వనం

**-శీలా వీర్రాజు**

**వర్షం!**

**కుండలతో దిమ్మరించినట్టు ఒకటే వర్షం.**

**ఎక్కడా ఏ వస్తువూ కనిపించడం లేదు. ప్రతి ప్రాణి కంటికీ, ఎదుటి వస్తువుకూ మధ్య వర్షం తెర. ఆ తెరల వెనక కనిపించీ కనిపించనట్టు దాగుడు మూతలాడే వస్తువులు. ఎన్ని వర్షం తెరలో! లెక్క లేనన్ని తెరల్ని లెక్కపెట్టాలంటే ముందుగా అక్కడ ఎన్ని ప్రాణులున్నాయో తెలుసుకోవాలి. అన్ని ప్రాణుల్నీ లెక్కలోకి తీసుకోకూడదు. చూస్తున్నవి మాత్రమేకావాలి. కలుగుల్లో నిద్రపోతున్నవీ, కళ్ళు మూసుకున్నవీ పనికిరావు. అలాగే వస్తువులూనూ, ఒక దాన్ని ఒకటి ఆవరించి పూర్తిగే కప్పేయకుండా కొద్దిగానన్నా కనిపించే వస్తువుల్నే లెక్కపెట్టాలి. అప్పటికీ యింకా ఓ చిక్కు మిగిలి పోయే వుంది. పది వస్తువులకీ అడ్డుగా ఒకే తెర వుండొచ్చు. ఒకే తెర పది చూపులకీ అడ్డు పడొచ్చు. లెక్కించడం కష్టమే! అందుకని ఒకే తెర మడతలుపడి, అన్ని వస్తువులనూ ఆవరించి చుట్టుకొని మెలికలు తిరిగి వుందని చెప్పుకుంటే అదోరకమైన తృప్తికరమైన సమర్థన.**

వర్షం చినుకులు నిప్పురవ్వల్లా తుళ్ళుతున్నాయి. చినుకుల్లో వెలుగు లేదు. నిప్పురవ్వల్లోని కాంతిని కొంత తగ్గించి చూస్తే ఎలా వుంటాయో అలా వున్నాయి చినుకులు.

ఆ కాంతిని తగ్గించడం సాధ్యం కాదని చాలా మంది అభిప్రాయం. కాంతి ప్రకాశం చూపునిబట్టి వుంటుంది. చూపు అన్నింటికీ ఒక్కరకంగానే లేదు. ఆకాశంలో ఎగిరే గ్రద్దకు చూపు తీక్షణమైనది. అంత మీదనుంచీ అది నేల మీదున్న చిన్నపిచ్చికను కూడా చూడగలదు. చూడడం అంటే ప్రకాశాన్ని గ్రహించడం అన్నమాట. వెలుగు పిచ్చికమీద పడి పరావర్తనమై ప్రయాణించి గ్రద్ద చూపుకు అందుతుంది. ఆ కొద్దిపాటి పరావర్తన వెలుగునూ అది గ్రహించగలదు. కాని మనిషి గ్రహించలేడు. మనిషి చూపు మందమైనది. కొద్దిపాటి పరావర్తన కిరణాల్ని అది గ్రహించలేదు. కనుక చూపునుబట్టి ప్రకాశం కనిపిస్తుంది. నిప్పు రవ్వల్లో కాంతిని తగ్గించాలంటే చూపులో భేదం రావాలి. చలవ కళ్ళజోడు పెట్టుకుంటే కాంతిని తగ్గించి చూడడం అన్నమాట.

నిప్పురవ్వలు ఏ నీలం రంగు కళ్ళద్దాల్లోంచో, మట్టిరంగు కళ్ళద్దాల్లోంచో కనబడ్డట్టు చినుకులు కన బడుతున్నాయి. కొండమీది రాతిబండలపై పడి పక్కలకు చెదిరి పడుతున్నాయి. అక్కడ అన్నీ కొండలే. కొండలపైన పైకి పొడుచుకొచ్చిన బండరాళ్ళు. కొండ దిగువ కనుచూపు మేర అడివి. కొన్ని వేల సంవత్సరాలుగా వర్షంలో కరిగి, యింకా మరి కొన్ని వేల సంవత్సరాల ఆయుష్షుతో ఆకాశంలోకి చూస్తున్నాయి బండరాళ్ళు.

ఆకాశంలో మేఘాలు దట్టంగా అలముకున్నాయి. ఆ అల్లికలో 'యూనిఫార్మిటీ' లేదు. నైరూప్య చిత్రంలా గజిబిజిగా వుంది. లేతరంగూ, ముద్దరంగూ కలవక ఎక్కడికక్కడ అతుకులు వేసి అంటించినట్టు వుంది.

ఒక కొండ మీద నుంచి మరో కొండమీదకు సూర్యుడు ప్రయాణం చేయడానికి వేసిన వంతెనలా వ్యాపించాయి మేఘాలు. ఆకాశం పాండురోగి ముఖంలా వుంది. మేఘాల పందిరిలా వుంది. పేదవాడి చిరుగుల చొక్కాలా వుంది. ధనవంతుడి భోజనానంతరం వెండిపళ్ళెంలో మిగిలి పోయిన వంటకాలలా వుంది. తడిసి తడిసి వెలిసిపోయిన నిష్టాత్ముడి మడిబట్టలా వుంది.


మేఘాలు కరిగిపోతున్నాయి. కరిగినా తరగడం లేదు. ఎక్కడినుంచో కొత్తవి ఎగిరి వచ్చి పడుతున్నాయి. బరువువల్ల కాబోలు కొండ అంచుల మీదకంటా వంగి మేత మేస్తున్నట్టున్నాయి. దగ్గర నుంచి చూస్తే మేఘాలు కనిపించడం లేదు. పొగ మంచులా వుంది. దూరం నుంచి చూసినప్పుడు అందమైన వంపులు తిరిగినట్టు మేఘాలు కనిపిస్తున్నాయి. ఎక్కడికక్కడే ఆర్చీలు లాంటి వంపులు! ఉంగరాల జుట్టులా వంపులు తిరిగిన మేఘాలు!

వర్షం ఆగకుండా కురుస్తూనే ఉంది. రాళ్ళమీద పడ్డ చినుకులు మెల్లగా కిందకు జారి సహ జీవనాన్ని అలవాటు చేసుకుని, నేల మీద పాకుతూ వెళ్ళి వాలులోకి మళ్ళి, కాలం గీసిన గీతల్లోంచి అడుక్కు కొట్టుకుపోతున్నాయి. కిందపడ్డ చినుకు వ్యక్తిత్వాన్నే వదులుకుంటోంది. పదింటితో కలిసి కొత్త చైతన్యంతో పరుగులు తీస్తోంది. ఏ రంగూ లేని శరీరానికి ఎరుపు రంగు పులుముకొని, తన అందాన్ని ఎవరికో చూపించాలన్న ఉబలాటంతో కదిలి వెళ్ళిపోతోంది. కొద్ది దూరం కదలివెళ్ళి, ఏ రాయో అడ్డుపడితే ఆగిపోయి, కొత్త మిత్రులు వచ్చే వరకూ ఎదురు చూసి, రాగానే కొత్త ఉత్సాహంతో మళ్ళీ ముందుకు కదులుతోంది. సహజీవనానికి చక్కటి నిర్వచనం అది!

పిల్ల కాలువలు కొండమీది చాళ్ళల్లో కిందికు దిగి కాలువలు కట్టి ప్రవహిస్తున్నాయి. ఆ కాలువలు పది రకాలుగా చీలి, మళ్ళీ కలుసుకుని ఒకే చాలులోకి వచ్చి చేరాయి.

ఎర్రటి ఏరు. కొండ లోయల్లోంచి పరుగెత్తుతోంది. గర్వంగా తలెత్తి నిలుచున్న బండరాళ్ళను పట్టుకుని ఒక్క కుదుపు కుదిపి కదిలించి, కూడా పది గజాల దూరం తీసుకుపోయి ఏడిపించి మరీ వదిలి పెడుతోంది. మరికొన్ని బండరాళ్ళను వెంట లాక్కుపోయి కోణాల్నీ ఎగుడు దిగుడుల్నీ అరగగొట్టి నునుపుగా సానబట్టి మెరుగులు దిద్దుతోంది. ఊరేగింపు వెనక చప్పట్లు చరుచుకొంటూ పరుగెట్టే పిల్లకాయల్లా గులకరాళ్ళు ప్రవాహం వెంట కొట్టుకుపోతూ గలగల్లాడు తున్నాయి. అదో రకమైన అందమైన శబ్దం. మోచేతి నిండుగా గాజులు తొడుక్కున్న స్త్రీ చేత భరతనాట్యం చేయిస్తున్నట్టుంది. ముస్లిం స్త్రీలు డోలక్ వాయిస్తున్నట్టుంది. వాళ్ళ చేతుల నిండుగా గాజులే!

ఒకచోట పది గజాల ఎత్తు మీద నుండి నిటారుగా కింది లోయలోకి దూకి, క్షణం సేపు చుట్టురా





చూసి మళ్ళీ ముందుకు ఉరకలు వేసుకొంటూ వెళ్ళిపోయింది ఏరు. ఉత్సాహాన్ని ఆపుకోలేక తుళ్ళుతూ మెలికలు తిరిగిపోయింది. 'బర్డ్స్ వ్యూ'లో ఏరు కొండల నడుమ మెలికలు తిరిగిన మట్టి రోడ్డులా వుంది. పగబట్టి కదులుతోన్న గోధుమ త్రాచులా ఉంది. గుక్కపెట్టి ఏడుస్తోన్న చంటి పిల్ల కన్నీటి ప్రవాహంలా వుంది.

గబగబా వెళుతున్న ఏరు చటుక్కున తలెత్తి చూసింది. ఎదురుగా అడ్డుగోడలా నిలుచుంది ఓ బండరాయి. దాని ముఖం నిండా గంట్లే. ఎన్నో ఎదురుదెబ్బల్ని తట్టుకుని, పెచ్చులు వూడి పోయి, అసహ్యంగా వుంది. ఏనాటిదో అది. ముసలితనం వచ్చేసినట్టు ముఖం మీద ముడ తల్లాంటి పగుళ్ళు. పైరంగు కూడా పాలిపోయింది. రక్తమంతా పోయి పాలిపోయినట్టు బూడిద రంగులో వుందది.

ఏరు నిర్లక్ష్యంగా ముందుకు వెళ్ళింది. బండరాయిని పట్టుకుని ఒక్క కుదుపు కుదిపింది. కదల లేదది. కసిగా దానిమీది కంటా పాకి, పట్టుదొరక్క కిందకు జారిపడి తలొంచుకుని దాని పక్క నుంచి ముందుకు వెళ్ళిపోయింది.

అలా వెళ్ళి వెళ్ళి మలుపు తిరిగి, వాలులోకి మళ్ళీ కొండ దిగువకు చేరుకుంది. దిగువన అన్నీ చెట్లే. అదంతా దట్టమయిన అడివి. ఆ అడివిలోని ఎండు టాకులు ప్రవాహం వెంట పరుగెత్తాయి. దారి పొడుగునా పహరా సైనికుల్లా నిలుచున్నాయి చెట్లు. చెట్లపాదాల్ని కడిగి ఆ జలాన్ని మోసుకుని వెళ్ళిపోయింది ఏరు.

ఒకచోట ఏమీతోచక ఓ చెయ్యి అలావిసిరి, విరిగిపడున్న ఎండుకొమ్మను ఒక దాన్ని వెంటేసుకొచ్చింది. వర్షం తగ్గిందికదా అని కలుగు బయటకొచ్చి తలెత్తి చూస్తున్న పాముని తల మీద అణిచి నీళ్ళల్లో ముంచి తిరిగి లేవనీయకుండా తనతోపాటు తీసుకు పోయింది. వర్షంలో తడిసి రెక్కలు బరువెక్కి ఎగరలేని ఓ పక్షి పిల్లను తోక పట్టుకుని నీళ్ళ అడుక్కు లాగేసింది.

అడవి దాటింది ఏరు. గులకరాళ్ళల్లోంచి ప్రవహిస్తోంది. కాసుల పేరు అటూ యిటూ కదిలినట్టు ఒకటే శబ్దం! కూడా వచ్చిన గులకరాళ్ళు కొద్ది దూరం వచ్చి, యిక ముందుకు వెళ్ళలేక ఒక్కొక్కటే ఆగిపోయాయి. ఏరు యిసుక పర్రలోకి మళ్ళింది. ఒడ్లు ఒరుసుకుని, కరిగి నీళ్ళల్లో పడు తున్నాయి. వెళ్ళేకొలదీ మార్గం విశాలమవుతోంది. గట్లు వొరుసుకుని విరిగి పడుతున్నప్పుడల్లా వింత శబ్దం వస్తోంది.

మళ్ళీ ఏదో చిట్టడివి. మైదానం. పొలాలు. అలసిపోయినప్పుడు. అక్కడక్కడ కొద్దిసేపు ఆగి విశ్రాంతి తీసుకుని మళ్ళీ ముందుకు వెళ్ళిపోతోంది ఏరు. గోతుల్లో దిగబడిపోయిన నీళ్ళు కదలలేక అక్కడే వుండి పోయాయి. పక్కలకు చెదిరిపోయినవి మళ్ళీ వెనక్కు రావడం యిష్టంలేక అక్కడే భూమిలోకి యింకి పోయాయి.

వర్షం మెల్లమెల్లగా తగ్గి సన్నగా తుంపర పడుతోంది. ఆకాశంలో మబ్బులు బీటలు వారి ముక్కలు వూడి దూరంగా విసిరేయబడ్డట్టు చెదిరిపోయాయి. ఒక ముక్క ఏనుగులా బరువుగా కదిలి కొండవెనక్కు వెళ్ళిపోయింది. మరో మేఘం గాలిలో పడవలా ఓ మూలకు కొట్టుకుపోయింది. ఇంకొకటి కుక్కపిల్లలా నిలుచుని చూసిచూసి చెట్ల గుబురుల్లో చిక్కడిపోయింది.

చూస్తూ వుంటే ఒక్కో మేఘం ఒక్కో ఆకారంలో కదిలిపోతోంది. మనిషి చూపుకూ, భావనకూ సన్నిహిత సంబంధం వుంది. భావనలేకపోతే మనిషి చూపుకు అందంలేదు. మనిషి మట్టి చూపు తోనే తృప్తి పడలేడు. భావన అనేది మనిషి సంపాదించుకున్న వరం. ఆ శక్తి వుంది కనుక మనిషి, చూపులోనే గాక ప్రతి చిన్న విషయంలోనూ దాన్ని ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తుంటాడు. చిన్న సంఘటనని పది మంది నోటి ద్వారా పంపితే అందమైన ఓ కథ తయారవుతుంది. దానికి కారణం మనిషి తన భావనాశక్తిని ఉపయోగించడమే. ఓ సంఘటనను అది జరుగుతుండగా చూసిన దానికన్నా, దానిని చెప్తుంటే వినడంలో చాలా ఆసక్తీ, అందమూ ఉంటాయి. చెప్పిన దానిలో భావనతో కూడిన కల్పన ఎక్కువ.

మేఘాలు దూరంగా తప్పుకొని ఆకాశం నిర్మలంగా కనిపిస్తోంది. మేఘాలు మోసుకుని పోయిన చీకటి, చెట్ల గుబరుల్లోనూ, కొండల వెనుకా దిగబడిపోయింది. సూర్యకిరణాలు ఏటవాలుగా జారి ఏరును మండిస్తున్నాయి. అసలే ఎర్రటి ఏరు. దానికితోడు కిరణాల మంట. యుద్ధం ముగిసిన సాయంకాలం అక్కడ పెద్దవర్షం పడి, ఆ స్థలాన్ని కడిగి శుభ్రం చేసి, రక్తపు నీటిని ఎక్కడికో దూరంగా తీసుకుపోయి వదిలివద్దామని బయలుదేరినట్టుంది.

మిగిలిపోయిన ఒక్కగానొక్క ఆఖరి మేఘపు తునకా తప్పుకోగా వాలిన లేత కిరణం. ఒకటి ఏటి మీద మండింది. ఆ కిరణం వాలినచోట అస్పష్టంగా పసుపురంగులో ఏదో మెరిసింది. దగ్గర నుంచి చూసినప్పుడు నీళ్ళలో అడవి చేమంతి పువ్వు తేలివస్తోంది.

ఏ కొండల్లోంచి ఏరు దాన్ని మోసుకొచ్చిందో మరి నీళ్ళల్లో తడిసి తడిసి చలికి ముడుచుకు పోయినట్లు రేకుల కొనలు వంకర్లు తిరిగి పోయాయి. పసుపురంగు నీళ్ళల్లో కరిగిపోయినట్టు కొద్దికొద్దిగా తెల్లబడుతోంది. అసలు, ఆడవి చేమంతిలా లేనే లేదు. మరేదో పువ్వులా వుంది. కొన్ని వేల సంవత్సరాల కిందట అడవి చేమంతి ఎలా వుండేదో అలా వుందది.

డార్విన్ పరిణామ వాదాన్ని బట్టి చూస్తే యీనాటి ప్రాణులన్నింటికీ మూలం అమీబా. ఏకకణ జీవి పెరిగి, చీలి రకరకాల రూపాలై సృష్టి విశాలమవుతూ వస్తోంది. దేనికీ స్థిర రూపం లేదు. పరిస్థితులకు అనుగుణంగా ప్రాణి

పరిణామమందుతూ సృష్టి రూపాన్ని మారుస్తోంది. అనాకారిత్వంలోంచి సృష్టి అందంలోకి ప్రయాణం చేస్తోంది. కోతిలోంచి పరిణామమంది మనిషి వచ్చాడు. మనిషిలోంచి పరిణామమంది మరో రూపం వస్తుంది. ఏదీ స్థిరం కాదు. కొన్ని వేల సంవత్సరాల కిందట మనిషికి ఈ రూపం లేదు. ఆ సిద్ధాంతాన్ని అంగీకరిస్తే కొన్ని వేల సంవత్సరాల కిందట గులాబీ పుష్పానికి యీనాటి రూపం వుండేది కాదని వప్పుకోవాలి. తామర పూలు ఎర్రగా, మృదువుగా, అందమైన స్త్రీ కళ్ళలాంటి రేకల్తో వుండేవి కావు. తాటిచెట్టు పొడుగ్గా స్తంభంలా ఎదిగి, తలమీద కుచ్చులటోపీ పెట్టుకున్నట్టుగా వుండేది కాదు. సన్నజాజులు మత్తెక్కించి కోర్కెల్ని రెచ్చగొట్టే యీనాటి సువాసనల్ని యిచ్చేవి కావు. అంతకు మరికొన్ని వేల సంవత్సరాల కిందట అసలు అవి సృష్టిలో వుండేవి కావేమో.

చేమంతి నీళ్ళలో తేలుతూ మునుగుతూ వస్తోంది. ఓ మధుపాయ్ ఎక్కడి నుంచో ఎగిరివచ్చి గాలిలో దాని చుట్టూ ప్రదక్షిణలూ చేస్తూ వెంబడిస్తోంది. ఆ తుమ్మెద తనను వెంబడించడం దానికి యిష్టంలేదు కాబోలు. అర్థాంతరంగా యౌవనం రాలిపోయిన స్త్రీ, వయసులోని పురుషుడ్ని చూసి బాధపడ్డట్టు దాని కళ్ళు చెమ్మగిల్లాయ్.

'మధుపాయ్! ఇప్పుడా నువ్వు రావడం? ఉదయమంతా కళ్ళల్లో వత్తులెట్టుకుని చూశానే! ఆ రాళ్ళ కింది చీకట్లో కలిసిపోకుండా నన్ను నేను కాంతులతో వెలిగించుకుని చూశానే. కాని ఎవరూ నా వయిపు చూడనే లేదు. అంతా అయిపోయాక యిప్పుడు నా వెంటబడితే మాత్రం ప్రయోజనం ఏమిటి? ఏమివ్వగలను నీకు. నా యౌవనం నీళ్ళ పాలైపోయింది' అన్నట్టు జాలిగా, బాధగా చూసి, దానికి తన ముఖాన్ని కనబడనీయకుండా నీళ్ళలో దాచుకొంటోంది.

పుష్పానికి దుఃఖం కూడా వస్తోంది. రేకల మీదకు చేరిన నీటి బిందువులు మెల్లగా జారి ఏటిలో కొట్టుకు పోతున్నాయి. ఈ మధుపాయ్ మరో గంట ముందుగా వచ్చి వుంటే ఎంత బావుండును! వర్షంలో తడిసి చలికి ముద్దయిపోయిన దాన్ని దగ్గరకు తీసుకొని వెచ్చగా రేకలతో కప్పి, దాని శరీరానికి అత్తర్లు పులిమి, తాగడానికి మకరందాన్ని యిచ్చి దేవుడిలా పూజించేది. ఇప్పుడేముంది తనకు యివ్వడానికి? అంతా అయిపోయింది. రాత్రి నుంచీ కురుస్తున్న వర్షంలో ఒక్కరూ తనవయిపు రానేలేదు. ఉదయం కళ్ళు తెరిచిన దగ్గర్నుంచీ ఎవరన్నా వస్తారేమోనని ఎదురు చూస్తూనే ఉంది. అదేం వర్షమో, మిన్నూ మన్నూ ఏకమైనట్టు ఒకటే వర్షం! ఎక్కడో ఏదో మధుపాయ్ ఆకలితో అరుస్తున్నట్టు శబ్దం వస్తే తలవంచి రాతికింద నుండి చూస్తోంది తను. ఏమీ కనిపించక అటూ యిటూ కళ్ళు పొడుచుకుని చూస్తోంటే ఎవరో పక్కవాటుగా వచ్చి మెడ మీద ఒక్క గుద్దు గుద్దారు. అంతే, తూలిపడిపోయింది తను... స్పృహ వచ్చేసరికి రెండు చేతుల్తోనూ ఎవరో తనని ఎత్తుకుని ఎక్కడికో లాక్కుపోతున్నారు.

కళ్ళు విప్పిచూసింది తను, ఎర్రటి ఏరు! తన మెడమీద గుద్ది పడగొట్టిన ఎండిపోయిన మోడు కూడా పహరా కాస్తున్నట్టు తన వెంటే వస్తోంది. తన యవ్వనమంతా నీళ్ళ పాలైపోయింది. ప్రాణాలు గిలగిలలాడుతున్నాయి. చూపుకూడా దిగజారిపోతోంది. ఇంకెంతో సేపు తను బతక లేదు. ఆఖరి క్షణాలు ప్రవేశించాయని అర్థమవుతూనే ఉంది. ఏదో మగత, కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి. ఎర్రటి ఏరు చీకటి సముద్రంలా కనిపిస్తోంది.


పుష్పానికి శోష వచ్చేసింది. ఏమీ కనిపించడం లేదు. చుట్టూచీకటి సముద్రం. అందులో ఎక్కడి నుంచో ఓ వెలుగు రేఖ పడుతోంది. ఆ వెలుగురేఖ అవతలి చివర ధగధగ మెరుస్తోన్న ఇంద్ర ధనస్సులోని రంగులు. ఎవరో పెద్ద చక్రాన్ని తిప్పుతున్నారు. ఆ చక్రానికి సప్తవర్ణాల ఆకులున్నాయి. చక్రం తిరుగుతుంటే రంగులు కనిపించడం లేదు. అంతా ఒకటే రంగు. తెలుపు రంగు.

'ఇదిగో ఇటే... ఇటే' అని ఎవరో దానికి చెయ్యి అందించారు. ఆ చేతిని అందుకుని గట్టిగా పట్టుకుని ఒక్క గెంతు గెంతింది పుష్పం.

పుష్పం నీళ్ళల్లో మునిగిపోయింది.

అది మళ్ళీ పైకి వస్తుందేమోనని మధుపాయ్ ఏటి వెంబడే ఎగురుతూ వెళ్ళింది. ఎవరికీ వినిపించకుండా రహస్యంగా పిలిచింది. చివరకి గొంతెత్తి పాట పాడింది. కాని పుష్పం మళ్ళీ కనిపించలేదు.

ఇందాకటి నుంచీ ఏరు దాన్ని చూస్తూనే ఉంది. ఆ మధుపాయ్‌ని చూస్తోంటే



## కథాంతరంగం

'ఏటిపాలైన యవ్వనం' కథను 1968లో రాశాను. ఈ కథలో ఓ ప్రయోగం చేశాను. సాధ్యమయినంతవరకూ మనుషులూ, పాత్రలూ ఉండకుండా పూర్తిగా వర్ణనాత్మకంగా సాగిన కథయిది. వర్షం కొండమీద పడి, చిన్న చిన్న కాలువలు కట్టి, ఏరై ఊరునుంచి వెళుతుంది. ఆ వూర్లో అమ్మాయి, అబ్బాయి కూడా అందులో కన్పిస్తారు. కొట్టుకొస్తున్న ఏటి నీటిలో 'చామంతి పూవు, తుమ్మెద'ఉండటంతో ముగింపు అర్థం అవుతుంది.

– శీలా వీర్రాజు

**04024065263**

ఏరుకు నవ్వొస్తోంది. ఆ నవ్వును ఆపుకోలేక పైకే నవ్వేసింది.

మధుపాయ్‌కి కోపం వచ్చింది. అభిమానం దెబ్బతింది. నోట్లో గొణుక్కుంటూ వెనక్కు వెళ్ళిపోయింది.

'లేకపోతే, దగ్గరకు పిలిచి రంగులూ, సువాసనలూ వంటికి అద్ది, తాగటానికి తేనె యిస్తే యీ మధుపాయ్‌లు వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ పాదాలతో ఆ పూలనే ఒక్క తన్ను తన్ని మరీవెళతాయి. వీటికి యిలానే జరగాలి. కృతఘ్నులు' అనుకుంది ఏరు. అక్కడి నుంచి కదలి వెళ్ళిపోయింది.

అటూ ఇటూ గట్లు. ఆ గట్లమధ్య ఏరు పరుగెత్తుతోంది. స్వేచ్ఛగా మెలికలు తిరిగి యిష్టం వచ్చినట్లు ప్రయాణం చేస్తూ యింతవరకూ వచ్చింది కానీ యిప్పుడా స్వేచ్ఛను ఎవరో గట్ల మధ్య బంధించేశారు. ఆ గట్లు తీసుకెళ్ళే మార్గంలోనే వెళ్ళాలి. అటూ యిటూ ఎత్తయిన గట్లు.

ఆ గట్ల వెనక ఏం వింతలున్నాయోనని ఎగిరెగిరి చూసుకుంటూ వెళుతోంది ఏరు. దూరంగా తాటి చెట్ల తలలు కనిపిస్తున్నాయి. తాటిచెట్ల వెనక ఆకాశం తగలబడిపోతోంది. ఏరుకు ఆదుర్దా ఎక్కువయ్యింది. తగలబడిపోతోన్న ఆకాశాన్ని అర్పుదామని వేగం హెచ్చింది. దృష్టంతా అటే పెట్టుకుని, పక్కలకు చూడకుండా పడమటికి వెళ్ళిపోతోంది.

ఎంతదూరం ప్రయాణం చేసినా తగలబడిపోతోన్న ఆకాశం దగ్గర కావడం లేదు. చివరకు, ఎవరో వెళ్ళి మంటల్ని ఆర్పేసినట్టున్నారు, ఆకాశంలో ఎరుపు రంగు క్రమక్రమంగా మాయమయి పోయింది. ఆ మండిపోయిన ఆకాశంలోంచి నల్లని నుసిరాలినట్టుగా మెల్లమెల్లగా చీకట్లు రాలుతున్నాయి.

వెనకనుంచి ఎవరో తనవైపు తొంగి చూస్తున్నట్టనిపించి మలుపు తిరుగుతూ ఓసారి వెనక్కు తిరిగిచూసింది ఏరు.

చంద్రుడు ఏటిమీదకు వంగి ఆ నీళ్ళలో తన ముఖాన్ని చూసుకుంటున్నాడు. తుమ్మచెట్టు వెనక చిక్కడిపోయిన చంద్రుడు మెల్లమెల్లగా చిక్కుల్ని విప్పుకుంటూ పైకి వచ్చేశాడు.

ఏదో వింతలోకంలోకి వెళ్ళినట్లనిపించింది ఏరుకు. కలలో కనిపించే అందమైన ప్రకాశం లాంటి కాంతి అది. కిరణాలు మంచుగడ్డలోంచి దూరి వచ్చినట్లు చల్లగా వున్నాయి. అదో కొత్తలోకం. అక్కడ అప్పుడే పాలవర్షం కురిసి వెలిసిపో

యింది. ఆ లోకంలో గాలిలో ''ఇథేన్'' ఎక్కువ. అందువల్ల అక్కడ అన్నీ శీతకిరణాలే. గాలికి కూడా వింత పరిమళం ఉంది.

ముందుకు వెళ్ళిపోతే యీ ప్రకాశం, యీ అందం లభించవేమోనని భయంతో ఏరు మందంగా కదులుతోంది. అటుఇటూ చూసుకొంటూ, మెలికలు తిరుగుతూ, ఒకొక్క వింతనే పరిశీలిస్తూ వెడుతోంది.

దూరంగా ఒకచోట భూమ్మీద కూడా నక్షత్రాలు వెలుగుతున్నట్లనిపించాయి. ఏరుకు ఆశ్చర్యం వేసింది. మెల్లగా కదిలి అటే వెళ్ళింది.

గట్టు దిగువన దూరంగా వెన్నెల్లో మెరుస్తోన్న పల్లె. తడిసిపోయిన తాటాకు పాకల మీద వెన్నెల పడి నిలవ లేక జారిపోతోంది. పాకల్లో దీపాలు నక్షత్రాల్లా మినుకుమినుకు మంటున్నాయి. కొబ్బరి చెట్లు పాకల మీదకు వంగి వెలుతుర్ని కత్తుల్లాంటి ఆకుల్తో చీలుస్తున్నాయి. చంద్రుడి అందం కొబ్బరి చెట్ల మధ్యనే. కొబ్బరిచెట్టే గాని సృష్టిలో లేకపోతే చంద్రుడికి యింత అందం వచ్చేదే కాదు.

ఊరు యింకా నిద్రపోలేదు కాబోలు, ఊళ్ళో నుండి పాటలూ, తిట్లూ, కుక్కల అరుపులూ గజి బిజిగా అస్పష్టంగా వినిపిస్తున్నాయి. ఎక్కడో ఏదో పెళ్ళి జరుగుతున్నట్టుంది. సన్నాయిమేళం, మద్దెల చప్పుడు గాలిలో ఎగిరి వస్తున్నాయి.

ఊరికి రెండు వైపులా ఏటిగట్టుంది. గట్టు వెంబడే వెళ్ళి సగం ఊరుని అక్కడినుంచే చూసి ముందుకు వెళ్ళిపోబోయింది.

సరిగ్గా అప్పుడే ఎవరో తెల్లటి బట్టల్లో వెన్నెల్ని మోసుకొని పాకల్లోంచి ఏటి వడ్డుకు సన్నని కాలిబాటలో పరుగెత్తుకుని వస్తున్నారు. పొలాలకు అడ్డంపడి వచ్చి గట్టెక్కి వగరుస్తూ నిల్చున్నారు. చనిపోయే ముందు ప్రాణం గింజుకున్నట్టు గాలికి చీర పవిట గింజుకొంటోంది. చీర కుచ్చిళ్ళు వుండి వుండి అసమర్థుడి ఆశలా గాలిలో ఎగిరి చప్పబడి పోతున్నాయి. పద్దెనిమిదేళ్ళ అమ్మాయి ఆమె! గట్టున నిలుచుని ఏరువంక నిశ్చలంగా చూస్తోంది. ఆమె చెంపల మీద వెన్నెల వాలి చెక్కిళ్ళు పాలరాతిలా మెరుస్తున్నాయి. కుడివైపు బుగ్గమీద కాటుక మచ్చ తెల్లటి చెక్కిలి మీద మరీ నల్లగా కనిపిస్తోంది. పాలరాతి గచ్చు మీద నల్లటి సిరాబొట్టు పలికినట్టుందది. కలువ పూవు మీద కందిరీగ వాలినట్టుంది. కళ్ళు నీళ్ళల్లో తడిసి ఉబ్బిపోయినట్టున్నాయి. కళ్ళ కింది రెప్పల నీడలు పడి గుంటలు మరీ లోతుగా కనిపిస్తున్నాయి. ఆ గుంటల్లోంచి కన్నీటి ప్రవాహాలు మైదానాల్లాంటి చెంపల మీదుగా ప్రవహించి కంఠం కింద చీకటి సముద్రంలో కలిసిపోతున్నాయి.

ఏరుకు చటుక్కున ఏదో జ్ఞాపకం వచ్చి నీళ్ళ అడుగున కొట్టుకొస్తున్న చేమంతిపువ్వును ఒడ్డుకు నెట్టింది. నీళ్ళల్లో మునుగుతూ తేలుతూ వెన్నెల్లో మెరిసిపోతోంది పువ్వు. ఏ స్త్రీ నుదుటి తిలకమో గంగపాలై ఎర్రబడ్డట్టున్న ఏటిలో మాంగల్యపు పసుపు కొమ్ములాగా వుందది.



గట్టు మీద నిలుచున్న అమ్మాయి ఆ పువ్వునే చూస్తూ వుండిపోయింది.

అకస్మాత్తుగా ఆమె వెనక పాకల్లో పెద్దపెట్టున సంచలనం బయలుదేరింది. అరడజను మంది జనం యిటే పరుగెత్తుకొస్తున్నారు ''అమ్మాయ్ అమ్మాయ్!.... ఏమిటిది .. ఒద్దు... ఆగు'' అని అరుస్తూ పొలాలకడ్డం బడి పరుగెత్తుకొస్తున్నారు.

ఆ అమ్మాయి ఓ సారి వెనక్కు తిరిగి చూసింది. కంఠం కొసవరకూ ఊపిరి పీల్చి కళ్ళు మూసుకుని నీళ్ళల్లోకి ఒక్క దూకు దూకింది.

''అయ్యో... అయ్యో'' అనుకుంది ఏరు. పిరికిదానిలా ఒక్కసారి అదిరిపడింది. ఆ అమ్మాయిని తనే చంపేయబోతున్నట్టూ, తను హంతకురాలు అయిపోతున్నట్టూ, భయపడి పోయింది. భయంతోనే అక్కడి నుండి పారిపోదామని పరుగు తీసింది.

వెనక పరుగెత్తుకొస్తున్న వారు గట్టును చేరుకున్నారు. గుండెలు బాదుకుంటూ గట్టు వెంబడే పరుగెత్తారు. వాళ్ళల్లో యిద్దరూ ఉన్నపళంగా నీళ్ళల్లోకి దూకి యీదుతున్నారు.

కొద్దిదూరం ఏటితోపాటు వెళ్ళి ఆ అమ్మాయిని పట్టుకుని ఒడ్డు కొచ్చాడు ఒకడు. మిగిలిన వారు పరుగెత్తుకెళ్ళి పైకి తీశారు. అప్పటికే ఆ అమ్మాయి కడుపు నిండా నీళ్ళు తాగేసింది. వెల్లకిల్లా పడుకోబెట్టి పొట్ట మీద అణిచి నీళ్ళు కక్కిస్తున్నారు.

ఎందుకు ఆ అమ్మాయి నీళ్ళల్లోకి దూకేసిందో ఏరుకు అర్థం కాలేదు.

గట్టుకింద పొలాల్లో మడులు కట్టడానికని ఎవరో ఏటిలో మట్టి తోలించుకుని వెళ్ళినట్టున్నారు, అక్కడ గుంట ఒకటి వుంది. ఆ గుంటలోకి మళ్ళీ, ఏం జరుగుతుందో అని చూస్తోంది ఏరు.

గట్టు కింద జొన్న చేనులో మొక్కలు ఫెళఫెళా విరిగిపోయాయి. ఏమిటోనని ఏరు గట్టు మీద కంటా పాకి తొంగి చూసింది.

ఓ యువకుడు జొన్నకర్రల్ని తొక్కుకొంటూ పరిగెత్తుకొచ్చాడు. గుండె తెగిపడిపోయేంత గట్టిగా వగరుస్తున్నాడు. స్పృహ లేక పడి వున్న అమ్మాయి కేసి పిచ్చిగా చూసి అమాంతం మెడ కింద చేయి వేసి పైకి లేవదీసి ''కాంతం...! కాంతం! ... నేనూ, నీ భద్రాన్ని .... నీ కోసం మూడొందల మైళ్ళ దూరం నుంచి కళ్ళల్లో జ్యోతులెట్టుకొని వచ్చాను. ఇలా చూడవు ఒక్కసారి..''

మాటలు బొంగురుపోయి పలకలేక ఏడుస్తున్నాడు యువకుడు.

యువతి మెల్లగా కదిలింది. బిగుసుకుపోతున్న కళ్ళ రెప్పల్ని బలవంతంగా పైకి ఎత్తి పట్టుకుని మరో లోకంలోకి చూస్తున్నట్టు చూసింది.

తడిసిపోయిన ఆ కళ్ళల్లో ఓ మూల కొద్దిపాటి వెలుగు వెలిగి క్షణం పాటు మెరిసింది. ''వచ్చావా భద్రం...! కాని... ఇప్పుడా.... రావడం... సమయం...''

ఏరుకు అంతా అర్థమైంది. ఏం జరిగిందో దానికి తెలిసిపోయింది. కూడా తీసుకొచ్చిన చేమంతి పువ్వును అక్కడే గట్టు దగ్గరే వదిలేసి, అక్కడ నుంచి కదిలి వెళ్ళిపోయింది యేరు.

*

## టాలీవుడ్‌కు తిరిగి రానున్న శ్రియ?

'ఇష్టం'తో తెలుగు ప్రేక్షకులు పరిచయమై దాదాపు తెలుగులో అగ్రహీరోల అందరి సరసన నటించింది శ్రియ. ఆ తరువాత తన దృష్టిని బాలీవుడ్, కోలీవుడ్ వైపు సారించి తెలుగు సినిమాలకు దూరం అయింది. తమిళ, హిందీ చిత్రాలలో బిజీగా ఉన్న శ్రియ తాజాగా రెండు తెలుగు సినిమాలలో నటించనుంది. విక్రమ్, విశాల్ హీరోలుగా నిర్మించనున్న రెండు తెలుగు సినిమాలలో శ్రియ నటించడానికి అంగీకరించింది. తెలుగులో విశాల్, విక్రమ్‌లు హీరోలుగా నటించిన సినిమాలన్నీ దాదాపు హిట్‌లే కావడంతో కొత్త చిత్రాలు కూడా విజయవంతం అవుతాయని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. అదే కనుక నిజం అయితే శ్రియ రీ ఎంట్రీ సూపర్ సక్సెస్ అని వారు అంటున్నారు. పై రెండు చిత్రాల గురించిన వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.